పల్లెల్లో తాండవిస్తున్న అపారిశుద్ధ్యం


తాళ్లగోకవరం గ్రామంలో ప్రజలను వణికిస్తున్న వానరాలు


గ్రామ శివార్లలో స్వైరవిహారం చేస్తున్న పందులు


చెత్తాచెదారంతో నిండి ఉన్న డ్రెయినేజీ

- విజృంభిస్తున్న దోమలు
- ఇది సీజనల్ వ్యాధుల సమయం
- అస్తవ్యస్తంగా పంచాయతీల నిర్వహణ

పెదవేగి: మండలంలోని పల్లెల్లో అపారిశుద్ధ్యం తాండవిస్తోంది. దోమలు మనుషులకు సవాల్ విసురుతున్నాయి. ఇప్పటి వరకు మమ్మల్ని బాగానే పోషించారు. అయితే పంచాయతీ అధికారులే కాదు. వైద్య సిబ్బంది కూడా ఏమి చేయలేరు. అంతా మా ఇష్టం అంటూ దోమలు రెచ్చిపోతున్నాయి. మరి వాటి సవాల్‌కు అధికారులు ప్రతిస్పందిస్తారో లేదో? మండలంలో గ్రామీణ పారిశుద్ధ్యంపై దృష్టి సారించాల్సిన అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. పారిశుధ్య వారోత్సవాల్లో జిల్లా స్థాయి నుంచి అధికారులు పరిశీలనలు చేసినా వచ్చామా...వెళ్లామా అన్న విధంగా వ్యవహరించారు. గ్రామాల్లో రాజకీయ విభేదాలు తార స్థాయి చేరుతుండడంతో అభివృద్ధి కుంటు పడుతోంది. ప్రతిపక్ష సర్పంచ్‌లు ఉన్న పంచాయతీల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంది. అధికార పార్టీ నేతలు అటు సర్పంచ్‌లను కానీ, ఇటు అధికారులను కానీ పనులు చేయనీయడం లేదు. మురుగు నిల్వల దెబ్బకు దోమలు ఇష్టానుసారంగా స్వైర విహారం చేస్తున్నాయి.

బ్లీచింగ్ చల్లే దిక్కులేదు

ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. కనీసం మురుగు కాలువల వలన బ్లీచింగ్ చల్లేందుకు కూడా అధికారులు సహకరించడం లేదని సర్పంచ్‌లు చెబుతున్నారు. అదే విధంగా భోగాపురం గ్రామంలో ఇళ్ల ముందే పేడ దిబ్బలు కొడుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. యజమానులకు అవగాహన కల్పించాల్సిన అధికారులు, వైద్య సిబ్బంది ఆ వైపు ఆలోచించడం లేదు. గ్రామ శివారు కాలువల్లో చెత్తాచెదారంతో పాటు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లతో కాలువ నిండిపోయింది. దుర్వాసన వెదజల్లుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లిన దాఖలాలు కనిపించడం లేదు. కూచింపూడి గ్రామంలో మంచినీటి ట్యాంకులు వెళ్లే ఎయిర్ వాల్వ్‌లు కూడా శుభ్రం చేయలేదు. ఇది పాచిపట్టి దుర్వాసన వస్తోంది. అక్కడ చేరిన నిల్వ నీరు తిరిగి పైపుల్లో నుంచి కుళాయిలకు చేరుతోంది. ఇక పలు గ్రామాల్లో ప్రధాన రోడ్డులోనే మురుగు తొలగించడం లేదు. పంచాయతీ నిధులు మాత్రం ఆ పనులు చేశాం, ఈ పనులు చేశామని డ్రా చేసుకోవడమే తప్ప పారిశుద్ధ్య చర్యలు ఏ మాత్రం మెరుగుపడడం లేదు. ముందూరు, వేగివాడ, బాపిరాజుగూడెం, బి.శింగవరం, కొప్పాక గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి.

భయపెడుతున్న గ్రామ సింహాలు

గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. రాట్నాలకుంట, కొండలరావుపాలెం, కూచింపూడి, వేగివాడ, దిబ్బగూడెం,పెదవేగి గ్రామాల్లో శునకాలు ముచ్చెమట పట్టిస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీధుల్లో తిరిగే కుక్కలు ఎప్పుడు ఎవరిపై దాడి చేస్తాయోనని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. తాళ్లగోకవరంలో కోతులు ఇళ్లలో చొరబడి వస్తువులను తీసుకెళుతున్నాయి. ఇళ్లల్లో ఆదమరచి ఉన్నారంటే ఏ వైపు నుంచి వస్తాయో ఇంట్లోకి వచ్చి ఏది దొరికితే అది ఎత్తుకెళుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. వీటిని నివారించాలని పంచాయతీ అధికారులను కోరినప్పటికీ కుక్కలను, కోతులను నివారించేందుకు నిధులు లేవని చేతులెత్తేస్తున్నారు. వీటిని ఫారెస్ట్ అధికారులు పట్టుకొని అడవుల్లో వదిలేయాల్సి ఉంటుందని ఆ విధంగా చర్యలు తీసుకోండని అధికారులు ప్రజలకు సలహాలు ఇస్తున్నారు. మండలంలో 30 పంచాయతీల్లో 56 గ్రామాలున్నాయి. వీటిలో ఇన్‌చార్జి కార్యదర్శులే ఎక్కువ ఉండటంతో మిగిలిన పంచాయతీలకు అధికార పార్టీ నాయకులు చెప్పిన విధంగానే పని చేయాల్సి రావడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోతున్నాయి. కార్యదర్శులు పార్టీలకు అతీతంగా నిధులు ఖర్చు చేయడం లేదని పలువురు అంటున్నారు.

ప్రజలు సిబ్బందికి సహకరించాలి

పంచాయతీ సిబ్బందితో ప్రజలకు నిత్యం పారిశుద్ధ్యంపై అవగాహన కలిప్తున్నాం. ఎప్పటి కప్పుడు సిబ్బంది చెత్తను తొలగిస్తూనే ఉన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలనే ధృఢ సంకల్పం లేకుంటే పంచాయతీ సిబ్బంది ఎంత చేసినా, ప్రయోజనం ఉండదు. స్థానికంగా డంపింగ్‌యార్డ్‌ను కూడా నిర్మించాం. సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించాలంటే ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి.

– మాత్రపు కోటేశ్వరరావు, జగన్నాదవరం సర్పంచ్

బిల్లులు చేసుకోవడంతో సరి

పంచాయతీల నిర్వహణ బిల్లుల వరకే తప్ప కార్యరూపంలో ఏమి ఉండడం లేదు. ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో, గ్రామాల్లోని పురవీధుల్లో దోమలు విపరీతంగా వ్యాప్తి చెందుతూ, ప్రజలను పలు ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. కనీసం మురుగు చేరిన చోట బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే ఈ రోజుల్లో కనీస జాగ్రత్తలు తీసుకోపోవడం దారుణం. పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– పామర్తి రవికుమార్, భోగాపురం గ్రామస్తుడు

క్లుప్తంగా

న్యాయవాది ఇచ్చిన మనోధైర్యం వెలకట్టలేనిది


న్యాయవాది ఈడ్పుగంటి శ్రీనివాసరావును సత్కరించిన వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు కామిరెడ్డి నాని

దెందులూరు: ప్రముఖ న్యాయవాది ఈడ్పుగంటి శ్రీనివాసరావు అందించిన మనోధైర్యం వెలకట్టలేనిదని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం న్యాయవాది శ్రీనివాసరావు నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఆయనను సత్కరించారు. కష్ట కాలంలో ఉన్న తనను బెయిల్ మంజూరు చేయించిన శ్రీనివాసరావుతో పాటు వైఎస్సార్ సీపీ లీగల్ టీం వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులను తాను ఎన్నటికీ మరువను అన్నారు. వారు అందించిన సహాయ సహకారాలు మానసిక ధైర్యాన్ని వెలకట్టలేనివని కామిరెడ్డి నాని అన్నారు.

కళ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి


కళ్ల కలకపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దెందులూరు: వర్షాకాలంలో సాధారణంగా వచ్చే కళ్ల కలకపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ ఆప్తమాలిక ఆఫీసర్ దివ్య అన్నారు. ఆదివారం దెందులూరు సీహెచ్‌సీలో కళ్ల కలకపై అవగాహన కల్పించారు. కళ్ల కలక వచ్చిన వారు తరచూ వేడి నీటితో కళ్లను కడుక్కోవాలని ఉతికిన కండువాతో మాత్రమే తుడుచుకోవాలన్నారు. నల్ల కళ్లద్దాలు ధరించి కంటి వైద్యుల సూచనలు సలహాలు వైద్య పరీక్షలు అనంతరం మందులు వాడాలన్నారు. కళ్ల కలకే కదా అని నిర్లక్ష్యం చేయకూడదని అది ఎటువంటి ప్రమాదానికైనా దారి తీయొచ్చని ఆమె సూచించారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు


సమావేశంలో మాట్లాడుతున్న పుప్పాల గోపి

ఉంగుటూరు: కాలేజీ విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించాలని, మానవత సభ్యులు నిర్ణయించారు. ఆదివారం మానవత సమావేశం గోపీనాథపట్నం గ్రామంలో కోనే వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. రీజియన్ చైర్మన్ గోపి మాట్లాడుతూ నల్లజర్లలో ఆగస్టు మూడో తేదీన నిర్వహించే నూతన కార్యవర్గ జిల్లా సమావేశానికి ఎక్కువ సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన పుప్పాల గోపిని సభ్యులు అభినందించారు. కైకరంలో పేద మహిళ ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించారు. సమావేశంలో గోపీనాథపట్నం సర్పంచి విష్ణుమూర్తి, ఎర్రమిల్లిపాడు సర్పంచి శ్రీనివాసరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రక్తహీనత పరీక్షలను నిర్లక్ష్యం చేయొద్దు


రక్తహీనతపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

దెందులూరు: రక్తహీనత పరీక్షలను ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయొద్దని గోపన్నపాలెం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ డాక్టర్ రోజ్ మేరీ అన్నారు. ఆదివారం గోపన్నపాలెం ప్రాథమిక వైద్యశాలలో రక్తహీనత అసంక్రమిత వ్యాధులపై అవగాహన పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లేకుండా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు ఆకుకూరలు, కూరగాయలు పోషకవిలువలు కలిగిన పదార్థాలను తీసుకోవాలన్నారు తగినంత విశ్రాంతి, వ్యాయామం ప్రతి వ్యక్తికీ తప్పనిసరి అన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు.

నేడు డీఎస్పీ కార్యాలయంలో పీజీఆర్ఎస్ నిర్వహణ

జంగారెడ్డిగూడెం: స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ యు.రవిచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలోని ప్రజలు సమస్యల పరిష్కారానికి పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జంగారెడ్డిగూడెం, చింతలపూడి సర్కిల్ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్లలో పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి: మండలంలలోని పెదవేగి సెక్షన్ పరిధిలో పెదవేగి నుంచి వెళ్లే రామసింగవరం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పథకంలో నూతన లైన్ నిర్మించనున్నాను. ఈ మేరకు ఈ నెల 28వ తేదీ సోమవారం, 29వ తేదీ మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని విద్యుత్ ఈఈ కేఎం అంబేద్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. కావున రామసింగవరం పరిధిలో గల వ్యవసాయ బోరు బావులకు విద్యుత్ ముందుగా అంటే తెల్లవారు జామున 3 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అంటే రెండు విడతలుగా రైతులకు విద్యుత్ సరఫరా చేస్తామని రైతులు గమనించాలని కోరారు. గృహ వినియోగదారులకు ఎటువంటి అంతరాయం కలగదని, కూచింపూడి సబ్‌స్టేషన్ నుంచి మైలార్ ఫీడర్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

దెందులూరు: వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏలూరు రూరల్ పరిధిలోని కోడెలు రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఏలూరు రూరల్ ప్రాంతానికి చెందిన కానూరు సాయిబాబా (30) స్థానికంగా మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడికి గంగా భవానితో వివాహం అయింది. భార్యా భర్తల మధ్య విభేదాలతో వీరు వీరు విడిగా ఉంటున్నారు. శనివారం రాత్రి ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిడమర్రు: బువ్వనపల్లిలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బువ్వనపల్లి గ్రామంలోని వెలంపేట ప్రాంతంలోని ఓ పశువుల పాకలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై వీర ప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 10 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,560 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని సోమవారం తాడేపల్లిగుడెం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

జోరుగా సాగుతున్న వరినాట్లు


పాతూరు వద్ద సార్వా వరి నాట్లు వేస్తున్న కూలీలు

భీమడోలు: వర్షాధార ప్రాంతాల్లో ఊపందుకున్న వరి నాట్లు పుడమి తల్లికి పచ్చ తోరణంలా కనిపిస్తున్నాయి. సార్వా సీజన్‌లో సకాలంలో వర్షాలు పడక, గోదావరి కాలువ నీరు పంట పొలాలకు చేరక, నాట్లు అలస్యమవుతున్నాయి. దీంతో రైతాంగం మెరక ప్రాంతాల్లో నారుమడులు ఎండిపోతుండడంతో ఇంజన్లు పెట్టి నీటిని తోడుకునే పరిస్థితులు దాపురించాయి. దీంతో ఈ పంట చేతి కందే వరకు భయంగా ఉందని రైతాంగం ఆందోళన చెందుతుంది. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఊపిరి పీల్చుకున్న రైతులు పనులు ముమ్మరం చేశారు. దీంతో సార్వా నాట్లు డెల్టా ప్రాంతాల్లో దాదాపు పూర్తయ్యాయి. వర్షంపై ఆధారపడిన ప్రాంతాల్లో రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల వ్యాప్తంగా 6 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 95 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయినట్లు సంబంధిత వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు.

ఆడబిడ్డ నిధి హామీని అమలు చేయాలి

భీమడోలు: ఆడబిడ్డ నిధి హామీని వెంటనే అమలు చేయలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ డిమాండ్ చేశారు. ఆడబిడ్డ నిధి హామీని నెరవేర్చాలంటే ఆంధ్రను అమ్మేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు అనడం, మీ చేతకాని ప్రభుత్వ విధానమా అని ఆయన విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను నిరాంటకంగా అమలు చేస్తే కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక చతికిల పడ్డాయన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్లు లక్ష్యంగా ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి నెలా రూ.1500 అందిస్తామని హామీ ఇచ్చాయని, దీనిని అమలు చేయమంటే ఆంధ్రను అమ్మేయాల్సి వస్తుందని టీడీపీ సీనియర్ మంత్రి అచ్చెంనాయుడు అనడం దారుణమన్నారు. 13 నెలల కాలంలో కూటమిప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతను మూట కట్టుకుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పాలనపై దృష్టి సారించకుండా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ లిక్కర్ స్కామ్ పేరుతో అరెస్ట్‌లు చేయడం దారుణమన్నారు. కూటమి పాలనలో లిక్కర్ స్కామ్ జరుగుతుందని, విద్య వ్యవస్థ నిర్వీర్యమవుతుందని, పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందని ఆయన విమర్శించారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం


అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ప్రతినిధులు

భీమడోలు: భారత రత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు సంత మార్కెట్‌లోని అబ్దుల్ కలాం, డాగూరే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మారావు, సర్కిల్ అధ్యక్షుడు ద్రాక్షారపు శ్రీరామ్‌లు మాట్లాడుతూ సాధారణ స్థాయి నుంచి దేశ ప్రథమ పౌరునిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు. రక్షణ రంగంలో చేసిన సేవలతో దేశం ప్రపంచానికి ధీటుగా నిలిచిందన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుంచే యువత తన వంతు పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు పీవీఆర్ మూర్తి, ఏవీ నాగరాజు, ఏవీ రంగారావు, డి.శ్రీనివాస్, నరేష్, తేజ, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మ



వర్షాల కోసం రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ తల్లికి పూజలు చేస్తున్న దృశ్యం, విశేషాలంకరణలో అమ్మవారు

బుట్టాయగూడెం: వర్షాలు విస్తారంగా కురిసి చెరువులు జలకళ సంతరించుకోవాలని, పంటలు సమృద్ధిగా పండాలని కోరుతూ ఆదివారం బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో కనకదుర్గమ్మ తల్లికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున నీళ్ల బిందెలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరణ చేసి పసుపు కుంకుమలతో పూజలు జరిపారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు అల్లూరి రత్నాజీరావు, భౌమరాజు సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల ఆశించిన వర్షాలు కురవకపోవడం ఇటు ప్రజల్లో, అటు రైతుల్లో తీవ్రమైన ఆందోళన నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో కనకదుర్గమ్మ అమ్మవారికి జలాభిషేకం చేయడం వల్ల విస్తారంగా వర్షాలు కురుస్తాయనే నమ్మకంతో పూజా కార్యక్రమాలు జరిపించినట్లు తెలిపారు.

4న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

దెందులూరు: గోపన్నపాలెంలోని శ్రీకోదండ రామాలయంలో ఆగస్టు 4న ఉదయం 8.10 గంటలకు శ్రీసీతారామాంజనేయ, లక్ష్మణ, గణేశ, సుబ్రహ్మణ్య శ్రీకృష్ణ అయ్యప్ప స్వామి విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహిస్తామని ఏనుగు వెంకటేశ్వరరావు లక్ష్మి దంపతులు, భక్త బృందం తెలిపారు. ఆగస్టు 1వ తేదిన గ్రామంలో విగ్రహాల ఊరేగింపు 2 నుంచి 4వ తేదీ వరకు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సమీప గ్రామాల్లో భక్తులు విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరవ్వాలని కోరారు. 4న ఉదయం 11 గంటలకు అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం

కొయ్యలగూడెం: శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి నూతన ఆలయ నిర్మాణానికి రూ.1,01,116 విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ తాడికొండ మురళీకృష్ణ ఆదివారం పేర్కొన్నారు. గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి రెస్టారెంట్ యజమాని మందలపు వెంకట సుబ్రహ్మణ్యం (పెదబాబు), నాగ శేషు, నల్లపాటి లక్ష్మీకాంతం తమ తల్లి సంజీవమ్మ జ్ఞాపకార్థంగా ఈ విరాళంగా అందజేశారు. పోతవరం రోడ్డులో స్వయంభూగా వెలసిన పుట్టకి పడమటి వైపు నూతన ఆలయ నిర్మాణాన్ని చేపట్టినట్లు ట్రెజరర్ ఐలూరి విశ్వనాథ శర్మ పేర్కొన్నారు. రూ.35 లక్షల అంచనాతో ఆలయ నిర్మాణం సంకల్పించామని అన్నారు. సింహపురి రెస్టారెంట్ యజమాని మన్నే వెంకటరత్నం చౌదరి సుమారు రూ.40 లక్షల విలువైన మూడున్నర సెంట్లు స్థలాన్ని ఆలయ నిర్మాణానికి విరాళంగా అందజేశారన్నారు.

రైల్వే గేటు మీదుగా రాకపోకల పునరుద్ధరణ


రైల్వే గేటు మీదుగా రాకపోకలు సాగిస్తున్న వాహనాలు

భీమడోలు: రైల్వే ట్రాక్ మరమ్మతులు ముగిసినందున ఆదివారం సాయంత్రం నుంచి రైల్వే గేటు తెరుచుకుంది. దీంతో వాహన రాకపోకలు ఆరు రోజుల తరువాత పునః ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రైల్వేగేటు మూసేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. అనివార్య కారణాలతో 22వ తేదీ నుంచి ట్రాక్ అత్యవసర మరమ్మతులను చేపట్టారు. దీంతో జిల్లాలోని పలు డిపోలనుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నయ మార్గాల ద్వారా భీమడోలు చేరుకున్నాయి. ప్రముఖ ద్వారకాతిరుమల దేవస్థానానికి వెళ్లే భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అదే విధంగా వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులతో పాటు వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు తాడేపల్లిగూడెం, ఏలూరు వైపుగా వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడ్డారు.

నీతి కథలతో విద్యార్థుల్లో నైతిక విలువలు


గ్రంథాలయంలో చిన్నారులకు నీతి కథలు చెబుతున్న ఉపాధ్యాయుడు మండే సుధాకర్

భీమడోలు: విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు కథలు దోహద పడతాయని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ అన్నారు. భీమడోలు, గుండుగొలను, పూళ్ల శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టంలో భాగంగా కథలు చెప్పడం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మానవత్వం, ఏదీ జరిగినా మన కోసమే అనే అంశంపై పలు కథలను చిన్నారులకు వివరించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ మండే సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషాభివృద్ధి, ఊహాశక్తి, నైతికలు విలువలు, సృజనాత్మకతలు పెంపొందుతాయన్నారు. సాంస్కృతిక జ్ఞానం, మానసిక ప్రశాంతత సొంతమవుతాయని పేర్కొన్నారు. అనంతరం మాజీ రాష్ట్రపతి, భారతరత్న, అబ్దుల్ కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కలామ్ ఆశయ సాధనలో మనమంతా భాగస్వామ్యులు కావాలని కోరారు. ఆయన ఆదర్శ జీవితాన్ని ప్రతి ఒక్కరూ అలవర్చుకొని, చదువు ద్వారా సమాజ స్థాపన సిద్ధిస్తుందని ఆయన నిరూపించిన మహోన్నత వ్యక్తి అన్నారు. కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండి అనే నినాదాన్ని విద్యార్థి దశ నుంచి అలవర్చుకొని ఉన్నత స్థితికి చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు కె.శ్రీనివాస్, డీఎన్‌డీ అమర్‌నాథ్, బంగారు పాప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఖరీఫ్ పనులు

- మన్యంలో విస్తృతంగా వరి సాగు
- రైతులకు సూచనలిస్తున్న అధికారులు


బుట్టాయగూడెం శివారులో పొలంలో దుక్కి దున్నుతున్న దృశ్యం


బుట్టాయగూడెంలో వరినాట్లు వేస్తున్న మహిళా కూలీలు

బుట్టాయగూడెం: పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తూ ఉండడంతో రైతులు, కూలీలు సాగు పనుల్లో నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో పొలాల్లో దుక్కులు దున్ని రైతులు చదును చేస్తుండగా మరికొన్ని ప్రాంతాల్లో వరి నాట్లు వేస్తున్నారు. వరి నారుమడుల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులు, విత్తనాల ఎంపిక, భూమిని చదును చేయడం, నేల స్వభావం, నీటి లభ్యత, విత్తన శుద్ధి, ఎరువుల మోతాదు, తదితర అంశాలపై వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు.

జోరుగా వరినాట్లు

పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కొయ్యలగూడెం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ప్రస్తుతం వరి నాట్లు ముమ్మరంగా వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలో సుమారు 32,633 హెక్టార్లలో పంటలు సాగు చేసే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఈ ఏడాది వరి పంటతో పాటు ప్రత్తి, జొన్న, మినుములు, వేరుశనగ, తదితర పంటలు వేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నారు. ప్రస్తుతం పంటల సాగుకు వాతావరణం అనుకూలించడంతో రైతులు సాగు పనులను ముమ్మరం చేశారు. ఇప్పటివరకు 20 శాతం వరి నాట్లు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు.

విత్తే సమయం కీలకం

మధ్యస్థం, స్వల్పకాలిక విత్తన రకాలను ప్రస్తుతం సీజన్ నుంచి జూలై నెలాఖరు వరకూ వరినాట్లు వేసుకోవచ్చు. ఆగస్టు నెలాఖరు వరకూ ప్రధాన పొలాల్లో నాట్లు వేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ సమయంలో నాట్లు వేయడం ద్వారా పంట దిగుబడి బాగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక రకాలు సాగు చేయడం వలన చీడ, పీడల ఉధృతి పెడగడమే కాక నీటి వృథా కూడా ఎక్కువవుతుందని అంటున్నారు.

నారుమడుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- నారుమడిలో 2 క్వింటాళ్ల పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్ట్ వేసి రెండు మూడుసార్లు బాగా దమ్ము చేసి చదును చేయాలి.
- ఐదు సెంట్ల నారుమడిలో ఒక కిలో నత్రజని, 2 కిలోల భాస్వరం, ఒక కిలో పొటాషియం వంటి ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. విత్తనాలు వేసుకున్న 15 రోజుల తర్వాత కిలో నత్రజనిని వేసుకోవాలి. నాట్లు ఆలస్యమైతే రెండో దఫా నత్రజని వేసుకోవచ్చు.
- విత్తనం చల్లిన తర్వాత మొక్కదశలో పల్చగా నీరు ఉండాలి. సమగ్ర పోషక యాజమాన్యం, సస్యరక్షణతో నారును పెంచుకుంటే పంట పొలంలో వచ్చే సమస్యలను అధిగమించవచ్చు.